సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



107 మందికి 12 మందే !

నిజామాబాద్ ఏఎంసీలో 107 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 12 మందే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు.

- 8లో ▸



కొత్త మెనూ ప్రకారం భోజనం

గురుకుల విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

29.9 /10.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లో నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు తెలపాలన్నారు. సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కా ర్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

ప్రయాణికులు సంప్రదించవలసిన నంబర్లు

రీజినల్ మేనేజర్,

నిజామాబాద్	:	9959226011
ఆర్మూర్	:	9959226019
బోధన్	:	9959226001
నిజామాబాద్-1	:	9959226016
నిజామాబాద్-2	:	9959226017
కామారెడ్డి	:	9959226018
బాన్సువాడ	:	9959226020

ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అర్హులైన వారికి ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేపడుతున్నట్లు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ వర్గాలైన ముస్లిం, సిక్కు, బౌద్ధులు, జైనులు, పార్శీకి చెందిన మహిళలు అర్హులన్నారు. నిరుపేదలైన నిరాశ్రయులు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు అనాథ మహిళలు ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ రెండూ లేకపోతే గ్రామీణ ప్రాంతం వారికి వార్షికాదాయం రూ. లక్ష 50 వేల లోపు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షల లోపు ఉంటే అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉండాలన్నారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. కనీసం ఐదవ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు.

ధరణి అనే దరిద్రం పోయింది



వేల్పూర్: రైతులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ధరణి అనే దరిద్రం పోయిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన హామీ ప్రకారం దానిని రద్దు చేసి, భూభారతిని తీసుకువచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు చాలా ఇబ్బంది పడ్డారని, భూములు ఉన్నా పట్టాదారు పాస్‌బుక్‌లు రాక తీవ్ర ఇక్కట్లకు గురయ్యారన్నారు. ఏడాది కాలంగా రైతులు, మేధావులు, రెవెన్యూ అధికారులతో చర్చించి భూభారతిని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని వెల్లడించారు. కొత్త ఆర్‌ఓఆర్ చట్టం ప్రవేశపెట్టినందుకు సంతోషంగా ఉందని, దీంతో రైతులు పండగ చేసుకుంటున్నారన్నారు. యావత్ తెలంగాణ పక్షాన, కిసాన్ కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మూడు స్కూల్ బస్సులు సీజ్

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో మూడు ప్రయివేట్ స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆర్మూర్ రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టగా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 3 స్కూల్ బస్సులను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో నూతనంగా నియమితులై శిక్షణలో ఉన్న వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు నల్ల శ్రీనివాస్, బండారి పవన్ కళ్యాణ్, కుమ్మరి సాగర్, గణపురం రోహిత్‌రెడ్డి, ఆర్‌టీఏ సిబ్బంది ఉన్నారు.





హుషారుగా సీఎం కప్ క్రీడలు

సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు హుషారుగా సాగుతున్నాయి. గురువారం జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ మైదానంలో యోగ, కబడ్డీ, బ్యాడ్మింటన్, కుస్తీ పోటీలు జరిగాయి. నగరంలోని రాజారాం స్టేడియంలో ఆర్చరీ ఎంపికలు నిర్వహించారు. క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు పోటీలు జరగనున్నాయి. పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

– నిజామాబాద్‌నాగారం

యాచకురాలి దాతృత్వం

ఆ వృద్ధురాలు యాచకురాలు.. నిత్యం నగరంలోని రోడ్ల పక్కన వాహనదారుల వద్ద యాచిస్తూ, వారు ఇచ్చిన పదార్థాలను తింటూ గడుపుతుంది. ఈ క్రమంలో గురువారం ఆమెకు ఒకరు బ్రెడ్ ఇవ్వగా దానిని తినకుండా పక్కనే ఉన్న గోమాతకు తినిపించింది. అన్నీ ఉన్నా.. గోమాత ఆకలిని పట్టించుకోనివారు ఉన్న సమాజంలో.. యాచకురాలి దాతృత్వం అక్కడి వారిని ఆకర్షించింది. కంఠేశ్వర్ రోడ్డులో ఈ చిత్రం ఆవిష్కృతమైంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



భగీరథ.. నీరు వస్తోందా!



- జిల్లాలో 2 లక్షల 62 వేల ఇళ్లకు కనెక్షన్‌లు
- కొందరికి ఫుల్.. మరికొందరికి అంతంతే సరఫరా
- కొత్తగా కనెక్షన్‌లు ఇవ్వలేని పరిస్థితి
- లీకేజీలకు అడ్డుకట్ట పడేనా..

- జిల్లాలో 1706 వాటర్ ట్యాంకుల ద్వారా ఇప్పటి వరకు 2 లక్షల 62 వేల 190 ఇండ్లకు కనెక్షన్‌లు ఇచ్చారు. ప్రతినిత్యం 225 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్‌డే) సరఫరా అవుతున్నాయి. ఇందులో ప్రతినిత్యం సుమారు 10 ఎంఎల్‌డీ నీరు వృథాగానే పోతోంది. కొత్తగా కనెక్షన్‌లు అవసరం ఉన్నా.. ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి.

- జిల్లాలోని తండాలు, పల్లెలు, మండల కేంద్రాల్లో ఇంటింటికీ భగీరథ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. బోధన్, బాన్సువాడకు సింగూర్ ప్రాజెక్టు ద్వారా, నవీపేట్‌కు యంచ పథకం ద్వారా, ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో గ్రామాల్లో ఉన్న ఇళ్లకు ఎస్సారెస్పీ ద్వారా ఇంటింటికి తాగు నీటిని అందిస్తున్నారు. ప్రజల నుంచి రూపాయి కూడా వసూలు చేయకుండానే ప్రభుత్వమే అవసరం ఉన్న చోట గ్రిడ్‌లు, చిన్న , పెద్ద వాటర్ ట్యాంకులు, పైపులైన్‌లు నిర్మించడంతో పాటు ఇంటింటికి నల్ల కనెక్షన్‌లు సైతం బిగించారు.

నిజామాబాద్ నాగారం : ఇంటింటికీ భగీరథ నీరు వస్తోందా? అంటే.. అవునని, కాదని సమాధానం చెప్పే పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ఏళ్ల తరబడి భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రూ. కోట్లలో ఖర్చు చేసింది.

నీటి సరఫరా అస్తవ్యస్తం

జిల్లాలో చాలా గ్రామాల్లో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా చాలా సక్రమంగా జరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. ఒక్కో గ్రామంలో ఒక్కో ప్రాంతంలో నీటి కుళాయి ద్వారా ఫుల్‌గా నీరు వస్తుంది. మరికొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 నిమిషాలు కూడా సక్రమంగా నీరు సరఫరా కాని పరిస్థితి ఉంది. నీటి సరఫరాలో తేడాలు రావడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

కొత్త కనెక్షన్‌లు ఎప్పుడో..

గత ప్రభుత్వ హయాంలోనే జిల్లాలో కొత్తగా 585 వాటర్ ట్యాంకులు నిర్మించారు. పాత ట్యాంకులు 1121 ఉండడంతో ప్రస్తుతం 1706 ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారానే జిల్లాలోని 2 లక్షల 62 వేల 190 ఇళ్లకు కనెక్షన్‌లు బిగించి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం సమయంలో సుమారు 80 నిమిషాల పాటు నీటి సరఫరా చేస్తున్నారు. ఒక్కో కుటుంబానికి 100 లీటర్ల చొప్పున నీటిని అందిస్తున్నారు. అయితే కొత్త కనెక్షన్‌ల ఊసే లేకుండా పోయింది. జిల్లాలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అవుతూనే ఉన్నాయి. ప్రతి పల్లెలో కొత్తగా భగీరథ నీటి కనెక్షన్‌లు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను కలిసి ప్రజలు విన్నవిస్తున్నారు. దగ్గరలో పైపులైన్ ఉంటేనే కనెక్షన్‌లు ఇస్తున్నారు. లేకుంటే ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాదికిపైగా నీటి కనెక్షన్‌లు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వేల సంఖ్యలో ప్రజలు నీటి కనెక్షన్‌ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

10 ఎంఎల్‌డీ నీరు వృథా..

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీల ద్వారా భగీరథ నీరు వృథాగా పోతోంది. ప్రతినిత్యం సుమారు 10 ఎంఎల్‌డీ నీరు వృథా అవుతోంది. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు ఇచ్చాం

నీటి వృథా అరికట్టడానికి ఎక్కడిక్కడ సంబంధిత అధికారులు, ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తూనే ఉన్నాం. ఇంటింటికి తాగునీరు అందుతుంది. కొత్తగా ఇళ్లు కట్టుకున్న వారికి కనెక్షన్‌లు ఇవ్వలేకపోతున్నాం. ఆయా గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరా విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పాము. జిల్లాలో ఉన్న 1706 ట్యాంకుల్లో నీటిని ప్రతినిత్యం నింపుతున్నాం. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేంద్రకుమార్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

పొగాకు సాగు.. లాభాలు బాగు



రెంజల్ మండలంలో సాగవుతున్న పొగాకు పంట

- ప్రతి ఏటా జిల్లాలో పెరుగుతున్న పంట విస్తీర్ణం
- ఈ ఏడాది 2,302 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు
- టొబాకో కంపెనీలతో ముందుగానే ఒప్పందం
- గతేడాది క్వింటాలుకు రూ.9,600 పలికిన ధర

దొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని రైతులంతా అలవాటుగా వరి పంట సాగు చేస్తుంటే, బోధన్ డివిజన్‌లోని కొంతమంది రైతులు మాత్రం లాభాలిచ్చే ప్రత్యామ్నాయ పంటలవైపు చూస్తున్నారు. ప్రతి ఏటా యాసంగి సీజన్‌లో పొగాకు (టొబాకో)ను సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. రెంజల్, బోధన్, నవీపేట్, కోటగిరి మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులు ఈ పంటను నమ్ముకుని ఎకరాలకెకరాల్లో పొగాకును సాగు చేస్తున్నారు. రైతులు ఆసక్తి చూపడంతో జిల్లాలో ప్రతి సంవత్సరం టొబాకో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గతేడాది 2,225 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 2,302 ఎకరాల్లో సాగు చేశారు. అయితే, బోధన్ డివిజన్‌లోని కందకుర్తి, నీల, రెంజల్, కోటగిరి, బోర్గాం, సాటాపూర్, తాడ్‌బిలోలి, హంగర్గ, కొప్పర్గ గ్రామాల్లో ఈ పొగాకు పంటను యాసంగి సీజన్‌లో సాగు చేయడం ఆనవాయితీగా మారింది. తరాల నుంచి సాగు చేసే రైతులు చాలా మంది ఉన్నారు. అయితే, అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటనారు పోసి మొక్కలుగా ఎదిగిన వాటిని నాటుతారు. మొక్కలు బాగా ఎదిగి ఆకులు పెద్దవిగా మారేందుకు ఎకరానికి 7–8 బస్తాల యూరియాను చల్లుతారు. మూడు నెలల్లో చేతికి వచ్చే ఈ పంట ఒక ఎకరానికి 10–12 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మరో నెల రోజుల్లో పంట ఆకులను కోయనున్నారు.

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి

పొగాకును సాగు చేసే రైతులకు ఎకరానికి దాదాపుగా రూ.50 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతోంది. అయితే, టొబాకో కంపెనీలతో ముందుగానే ఒప్పందం చేసుకున్న తర్వాతే ఈ పంటను సాగు చేస్తారు.

పంట చేతికి రాగానే ఐటీసీ, బీఎస్‌టీ, అగ్రి లాంటి కంపెనీలకు విక్రయిస్తారు. క్వింటాలుకు రూ.9,500 వరకు కంపెనీలు కట్టివ్వడంతో రైతులకు అనుకున్నదానికంటే ఎక్కువ లాభం వస్తోంది. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుండడంతో పెట్టుబడి పోను దాదాపు రూ.40 వేల దాకా ఆదాయం వస్తోంది. కంపెనీలకే కాకుండా కందకుర్తి రెంజల్, కొప్పర్గ, సాలూర క్యాంపు, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లోని మార్కెట్ల లో కూడా రైతులు పొగాకును విక్రయిస్తున్నా రు. డిమాండ్ కూడా పెరుగుతుండంతో బోధన్ డివిజన్‌లో దీని సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది.

జిల్లాలో పొగాకు సాగు ఇలా..

సంవత్సరం	ఎకరాలు
2019-20	262.21
2020-21	74.3
2021-22	1130.04
2022-23	1140
2023-24	2,225.26
2024-25	2,302

నిండు కుండలా శ్రీరాంసాగర్

- యాసంగి సీజన్ వరకు ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ
- ప్రాజెక్టు చరిత్రలో ఇది రెండోసారి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు యాసంగి సీజన్ వరకు కూడా నిండు కుండలా ఉండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు చరిత్రలో ఇది రెండో సారి. ప్రస్తుతం ప్రాజెక్టులో 1091 అడుగుల నీటి మట్టంతో 80.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతంలో 2016 సంవత్సరంలో కూడ ప్రాజెక్టు నిండుకుండలా ఉందని ప్రాజెక్టు రికార్డులు తెలుపుతున్నాయి. ప్రస్తుత సంవత్సరం ప్రాజెక్టులోకి 282 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇప్పటి వరకు కాలువల ద్వారా ఆయకట్టుకు, తాగు నీటి అవసరాలకు 209 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. కాగా ఈ నెల 25 నుంచి యాసంగి సీజన్‌కు కాలువల ద్వారా నీటి విడుదల చేపడుతామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 787 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా 99 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది.

పట్టాల జారీపై ఆశలు!

- కొత్త రెవెన్యూ చట్టంలో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించనున్న ప్రభుత్వం
- గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించినా ఆచరణలో విఫలం
- పెండింగ్‌లో 25,345 దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త రెవెన్యూ చట్టంలో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశం చేర్చింది. దీంతో గతంలో సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని దరఖాస్తు చేసుకున్నవారిలో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో 25,345 మంది సాదాబైనామాలకు పట్టాలు ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నారు.

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలంలోని వడ్యాట్‌కు చెందిన నవ్యశ్రీ ఒక రైతు వద్ద రెండు ఎకరాల భూమిని 2013లో కొనుగోలు చేశారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉన్నా ఆమె సాదాబైనాలో పట్టా పొందవచ్చనే ఆశతో ఒప్పంద పత్రంతో సరిపెట్టుకుంది. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించింది. ఎవరైనా సాధారణ పత్రాలపై విక్రయ ఒప్పందాలు రాసుకుంటే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సర్కార్ సూచించడంతో నవ్యశ్రీతో పాటు జిల్లాలో 25,345 మంది సాదాబైనామాలకు పట్టాలు ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నారు. 2019లో కొత్త రెవెన్యూ చట్టం చేసిన అప్పటి ప్రభుత్వం సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించినా చట్టంలో ఉన్న కొన్ని సాంకేతిక కారణాలతో పట్టాల జారీకి ప్రతికూలత ఏర్పడింది. ఫలితంగా సాదాబైనామాల దరఖాస్తులు నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడంతో పాటు రెవెన్యూ చట్టం 2024ను ప్రతిపాదించింది. ఈ చట్టంలో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశం చేర్చడంతో గతంలో సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని దరఖాస్తు చేసుకున్నవారిలో ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ధరలు అధికంగా ఉండటంతో చిన్న సన్నకారు రైతులు సాదాబైనాలకు చట్టబద్ధత కల్పించే ప్రక్రియ కోసం వేచి చూస్తున్నారు. 2019 నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లు రెవెన్యూ కార్యాలయంలో సాగుతుండగా అంతకు ముందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే సాగేవి. అక్కడ రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ చేసి పట్టాలను జారీ చేసేవారు. ఈ తంతు వల్ల వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారికి పట్టాల జారీలో తీవ్ర జాప్యం కలిగేది. కొత్త రెవెన్యూ చట్టం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు మోక్షం కలిగించలేదు. చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మొర ఆలకించి కొత్త చట్టం ద్వారా సాదాబైనాలకు పట్టాలను జారీ చేసే విషయాన్ని తెరపైకి తీసుకువచ్చింది.



మోర్తాడ్ తహసీల్ కార్యాలయం

మంచి నిర్ణయం తీసుకుంది



సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా ఈ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా ప్రధాన సమస్యకు పరిష్కారం చూపనుంది. ఎంతో మందికి సాదాబైనామాలకు పట్టాలు జారీ చేసే అవకాశం లభించనుంది.

– ఎలాల రాజ్‌పాల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, మోర్తాడ్

రైతులు రుణపడి ఉంటారు..



సాదాబైనామాలకు పట్టాలను జారీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు రుణపడి ఉంటారు. సాదాబైనామలకు పట్టాల జారీ కోసం ఎంతో మంది నిరీక్షిస్తున్నారు. వారు అందరికి తొందరలోనే పట్టాలు జారీ అయ్యే పరిస్థితి ఏర్పడింది.

– సోమ దేవారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏర్గట్ల

సిరికొండ సొసైటీలో రూ. 75 లక్షల అవినీతి

సిరికొండ: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ. 75 లక్షల పైన అవినీతి జరిగినట్లు సహకార శాఖ అధికారుల విచారణలో వెల్లడైంది. సొసైటీ ఆవరణలో ప్రత్యేక మహాజన సభ గురువారం నిర్వహించారు. సభలో క్లస్టర్ ఆఫీసర్ సత్యనారాయణ విచారణ నివేదిక చదివి వినిపించారు. సొసైటీలో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంలో డీసీవో శ్రీనివాస్‌రావు శాఖాపరమైన విచారణ చేయించారు. విచారణలో గతంలో సీఈవోలుగా పని చేసిన వారు, డైరెక్టర్లు రూ.75,07,904 తమ సొంతానికి వాడుకున్నట్లు తేలిందని క్లస్టర్ అధికారి తెలిపారు. సొసైటీ నిధులను వాడుకున్నవారు సంఘానికి చెల్లించాలని, లేని పక్షంలో వారిపై తగిన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గతంలో సీఈవోగా పని చేసిన అలీ 134 మంది రైతులు తీసుకున్న రుణాల వివరాలను ఆన్‌లైన్ చేయకపోవడంతో రుణ మాఫీ కాలేదన్నారు. వాటిని సీఈవో నుంచి రికవరీ చేయాలని కోరారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి షేర్ అమౌంట్ వివరాలు లేవని, దీనిపై కూడా తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ.. అవినీతిని ప్రోత్సహించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ సాయిరి నర్సయ్య, డైరెక్టర్లు, సీఈవో గిరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ గంగాధర్

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న యువకుడు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన గంగాధర్‌ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. తాడ్వాయికి చెందిన కీసరి గంగాధర్‌ బుధవారం మద్యం తాగి పోలీసులు చూస్తుండగానే పోలీసు స్టేషన్‌ ఆవరణలో ఉన్న చెట్టుపైకి ఎక్కి కిందకి దూకి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. వెంటనే అతడిని పోలీసులు హైదరాబాద్‌కు తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. తీవ్రంగా దెబ్బలు తగలడంతో అతడికి ఒక చెయ్యి, ఒక కాలు పనిచేయడం లేదని తెలిసింది.

ఇసుక అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు



రుద్రూర్‌: ఇసుక అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో అన్నారు. పోతంగల్‌ మండలం హంగర్గా శివారులోని మంజీర నది పరిసర ప్రాంతాలను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పోతంగల్‌ మండలంలోని మంజీరా నది నుంచి రాత్రి వేళల్లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులను అప్రమత్తం చేశారు.

సమయపాలన పాటించని ఎస్సైలకు పనిష్మెంట్‌?

ఖలీల్‌వాడి: పోలీసులు అంటే క్రమశిక్షణకు మారుమారు. అలాంటి పోలీసులు సమయపాలన పాటించకపోవడంతో పోలీస్‌ బాస్‌ చర్యలు తీసుకున్నట్లు వినవస్తోంది. ఐదు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో పోలీస్‌ బాస్‌ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పలువురు ఎస్సైలు సమయపాలన పాటించలేదు. సుమారు 15 నిమిషాల నుంచి అరగంట లేటుగా రావడంతో పోలీస్‌ బాస్‌ సీరియస్‌ అయినట్లు సమాచారం. దీంతో సమీక్షకు లేటుగా వచ్చిన ఎస్సైలను గ్రౌండ్‌లో 10 రౌండ్లు రన్నింగ్‌ చేయాలని, దీనిని ఓ ఏసీపీ పర్యవేక్షించాలని ఆదేశించినట్లు పోలీసువర్గాల్లో వినిపిస్తుంది. 10రౌండ్లు పూర్తయిన తర్వాతనే సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పోలీస్‌ శాఖలో హాట్‌ టాపిక్‌గా మారిందని సమాచారం.

ఆక్రమణల తొలగింపు



నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రంలోని పలుచోట్ల అక్రమంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను అధికారులు తొలగించారు. గురువారం బస్టాండ్‌ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన నిర్మాణాలను బల్దియా టౌన్‌ప్లానింగ్‌ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. మంత్రి పర్యటన నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

107 మందికి 12 మందే రెగ్యులర్‌

- మరో 16 మంది అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది
- ఇదీ నిజామాబాద్‌ ఏఎంసీ దుస్థితి
- అధిక పనిభారంతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు



నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కార్యాలయం

సుభాష్‌నగర్‌: రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం కలిగిన మార్కెట్లలో నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ప్రధానమైనది. అలాంటి మార్కెట్‌ను ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడ 107 మంది రెగ్యులర్‌ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే రెగ్యులర్‌ ఉన్నారు. మరో 16 మంది అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితోనే మార్కెట్‌ కమిటీ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అధిక పనిభారంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వచ్చేది పసుపు సీజన్‌..

జనవరి నుంచి పసుపు సీజన్‌ ప్రారంభం కానుంది. మార్కెట్‌లో పసుపు క్రయవిక్రయాలు అధికంగా జరుగుతాయి. మార్కెట్‌ కమిటీ ఆదాయం సగటున రూ.20కోట్ల వరకు ఉంటుంది. గతేడాది కంటే ఈసారి పంట దిగుబడులు పెరిగే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతేడాది 4,89,216 క్వింటాళ్ల పసుపు వచ్చింది. ఈ సీజన్‌లో సుమారు 6లక్షల క్వింటాళ్ల పసుపు పంట రానుంది. నిజామాబాద్‌, జగిత్యాల్‌, నిర్మల్‌, ఆదిలాబాద్‌, కామారెడ్డి జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను తీసుకొస్తుంటారు. ఒక్కోరోజు మార్కెట్‌కు దాదాపు 60వేల నుంచి 70వేల పసుపు బస్తాలు (దాదాపు 30వేల క్వింటాళ్ల వరకు) వస్తాయి. గతంలో లక్షకు మించి బస్తాలు వచ్చిన రోజులు కూడా ఉన్నాయి. అధికంగా పంట మార్కెట్‌కు వచ్చినప్పుడు తగిన సిబ్బంది లేక కొనుగోళ్లలో, తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ..

నిజామాబాద్‌ మార్కెట్‌యార్డులో కీలకమైన పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. గ్రేడ్‌–2, గ్రేడ్‌–3 సెక్రెటరీలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్‌ సెక్రెటరీలు, సీనియర్‌ అసిస్టెంట్లు, జూనియర్‌ అసిస్టెంట్లు, అసిస్టెంట్‌ మార్కెట్‌ సూపర్‌వైజర్‌ పోస్టుల్లో అరకొర సిబ్బంది ఉన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్‌ ఇంజనీర్‌, ఇంజనీరింగ్‌ సూపర్‌వైజర్‌, డ్రైవర్‌, టైపిస్ట్‌, గ్రేడర్‌, బిడ్‌ క్లర్స్‌ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా మార్కెట్‌యార్డులో 10 సెగ్మెంట్లు ఉండగా, నలుగురు మాత్రమే సూపర్‌వైజర్లు ఉన్నారు. ఒక్కొక్కరికి రెండు చొప్పున సెగ్మెంట్ల బాధ్యతలు చేపట్టడంతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. ఇటీవల పదోన్నతి పొందిన సూపర్‌వైజర్‌ ఒత్తిడితో అనారోగ్యానికి గురయ్యారు. గత ఐదారేళ్లుగా మార్కెట్‌యార్డు ఔట్‌సోర్సింగ్‌ సిబ్బందితో కొనసాగించాల్సి వస్తోంది. అవసరం మేరకు కేవలం ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులను నియమించుకుంటున్నారు. మార్కెటింగ్‌శాఖలో కొన్నేళ్లుగా నియామకాలు జరగలేదు. దీనికితోడు ఉద్యోగుల పదవీ విరమణతో ఖాళీల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్‌ కమిటీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

మంత్రికి విన్నవించాం..



త్వరలోనే మార్కెట్‌కు పసుపు పంట రానుంది. మార్కెట్‌యార్డులో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. పూర్తిస్థాయి ఉద్యోగులు ఉంటే తప్ప సమర్థవంతంగా క్రయవిక్రయాలు జరపడం సాధ్యం కాదు. ఈవిషయం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లాం. కొందరినైనా డిప్యుటేషన్‌పై పంపించాలని విన్నవించాం. తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగుల నియామకానికి అనుమతికి కోరాం. మంత్రి సానుకూలంగా స్పందించారు.

–ముప్ప గంగారెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, నిజామాబాద్‌

కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- మోర్తాడ్‌లోని బీసీ గురుకులం తనిఖీ


మోర్తాడ్‌లోని జ్యోతిబాపూలే పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

మోర్తాడ్‌: గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మెనూ ప్రకారమే భోజనం అందించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సిబ్బందిని ఆదేశించారు. మోర్తాడ్‌లోని జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలను సక్రమంగా భద్రపరిచి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వెల్లడించారు.

సర్వేలో తప్పులు దొర్లవద్దు..

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లు ఉండవద్దని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మోర్తాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. సరైన విధంగా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని తెలిపారు. సర్వేలో లోపాలు చోటుచేసుకుంటే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్మూర్‌ ఆర్‌డీవో రాజాగౌడ్‌, తహసీల్దార్‌ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, ప్రిన్సిపాల్‌ ప్రసాద్‌, ఎంపీవో శ్రీధర్‌, కార్యదర్శి సైఫుద్దిన్‌ బాబా ఉన్నారు.

సామాజిక భూమికలే సాహిత్య ఉద్యమాలకు పునాది


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్‌ కాసిం

తెయూ (డిచ్‌పల్లి): సామాజిక భూమికలే సాహిత్య ఉద్యమాలకు పునాదులని ప్రముఖ కవి, విమర్శకులు ఓయూ ఆర్ట్స్‌ కాలేజ్‌ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ కాసీం తెలిపారు. దీనికనుగుణంగా తెలుగు సాహిత్యంలో సంఘ సంస్కరణ, జాతీయోద్యమం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ సాహిత్యం, స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు వచ్చాయన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు విభాగం, సెంట్రల్‌ ఇన్‌ స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండియా లాంగ్వేజెస్‌ (భారతీయ భాషా విభాగాల సంస్థ), రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు అధ్యాపకులకు నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులు రెండోరోజు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో కాసీం మాట్లాడుతూ.. చారిత్రక, రాజకీయ పరిస్థితులు సమాజ పరిణామాన్ని నిర్ణయిస్తే సాహిత్యం దాన్ని రచన ద్వారా తెలియపరుస్తుందన్నారు. వీటన్నింటికి కవిత్వంలో వచ్చిన స్పందనలే కవితోద్యమాలు అవుతాయన్నారు. రచయిత్రి యుద్ధనపూడి రెడ్డి శ్యామల ప్రసంగిస్తూ.. నిఘంటువులు ఎలా తయారు చేస్తారు. తెలుగులో ఇప్పటిదాకా వచ్చిన పద్య నిఘంటువులు, కారాది నిఘంటువులు అంటే ఏమిటి అనే అంశాలను వివరించారు. ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్య ప్రసంగిస్తూ.. సాహిత్య విమర్శలో పలు పద్ధతులను పరిచయం చేశారు. నిర్వాహకురాలు కరిమండ లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు యోగా వర్క్‌షాప్‌


యోగాసనాలు చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని సారంగపూర్‌ లోగల తెయూ బీఈడీ కళాశాలలో గురువారం ఛాత్రోపాధ్యాయులకు యోగా వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈసందర్భంగా యోగా రామచందర్‌, సిద్ది రాములు వర్క్‌షాప్‌లో భాగంగా ఛాత్రోపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి మానవుడు 41రోజులు సాధన చేసినట్లయితే శరీరంలో అనేకమైన మార్పులు వస్తాయని వివరించారు. నిత్యం యోగా చేస్తే కలిగి ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్‌ సాయిలు, అధ్యాపకులు శ్రీనివాస్‌, యోగా ప్రాజెక్ట్‌ ఇన్‌చార్జి కరుణాకర్‌, రవీందర్‌, హరిత, గణేష్‌, సరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బ స్కూల్‌ టీచర్‌కు డిప్యుటేషన్‌

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితం టీచర్‌ కళ్యాణిని డీఈవో అశోక్‌ డిప్యుటేషన్‌పై బోర్గాం పాఠశాలకు పంపించారు. ఇటీవల ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని అకారణంగా కొట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. అంతేకాక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక ఎంఈవో కూడా విచారణ చేపట్టి, టీచర్‌ తప్పు లేదని రిపోర్టు ఇచ్చారు. కానీ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో టీచర్‌ను డీఈవో డిప్యుటేషన్‌కు పంపించారు.

చిరుత సంచారం.. భయాందోళనలో ప్రజలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కంచుమల్‌ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సీతాయిపల్లి, కంచుమల్‌ మార్గమధ్యలో రోడ్డుపై బుధవారం రాత్రి పలువురికి చిరుతపులి కనిపించినట్లు వాహన చోదకులు తెలిపారు. దీంతో స్థానిక గ్రామాల ప్రజలు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుత పులిని బంధించాలని కోరుతున్నారు.

మూడో టౌన్‌ ఎస్సైగా హరిబాబు బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌ వాడి: నగరంలోని మూడో టౌన్‌ ఎస్సైగా హరిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న ఎస్సై వ్యక్తిగత సెలవుల్లోకి వెళ్లడంతో ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న హరిబాబు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రుడు


శ్రీరాములవారి బంగారు పాదుకలు


మాట్లాడుతున్న సురేశ్‌ ఆత్మరాం మహరాజ్‌

- హైదరాబాద్‌ నుంచి జిల్లాకు చేరిన రాములవారి బంగారు పాదుకలు
- ఘన స్వాగతం పలికిన భక్తులు

నిజామాబాద్‌ రూరల్‌: భారతదేశానికి ఆదర్శ ప్రాయుడిగా శ్రీరామచంద్రుడు నిలిచిపోయాడని రామదాసి రామదీక్ష గురుపీఠం, చిలుకూరు హైదరాబాద్‌ వ్యాస్తవ్యుడు శ్రీశ్రీ సురేశ్‌ ఆత్మరాం మహరాజ్‌ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌ నుంచి జిల్లా కేంద్రానికి శ్రీరాముని బంగారు పాదుకలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కంఠేశ్వర్‌లోని శ్రీరామగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సన్నాతన ధర్మాన్ని కాపాడుకునే తరుణం వచ్చిందని అన్నారు. ఈనెల 17న లోకకల్యాణం కోసం ప్రారంభమైన రాముని బంగారు పాదుకల పాదయాత్ర ఈ నెల 30న అయోధ్యకు చేరుకుంటుందని వివరించారు. ఇందులో భాగంగా ఆర్మూర్‌, కొండగట్టు, నిర్మల్‌, వేములవాడ మీదుగా అయోధ్యకు చేరుకుంటుందని తెలిపారు. శ్రీరాముని బంగారు పాదుకలను శుక్రవారం సందర్శనకు నగరంలోని శ్రీరామగార్డెన్‌లో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఉంటుందని, భక్తులు సందర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలదారులు రాకేశ్‌, విజయ్‌, మహేందర్‌, భక్తులు పాల్గొన్నారు.

కట్నం కోసమే హత్య చేశారు

- మృతిచెందిన ఫోక్‌ సింగర్‌ శృతి తల్లిదండ్రుల ఆరోపణ

వర్ని: తమ కుమార్తెను కట్నం కోసమే అత్తింటివారు హత్యచేశారని ఫోక్‌ సింగర్‌ శృతి తల్లిదండ్రులు ఒక ప్రకటనలో ఆరోపించారు. మోస్రా మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన ఫోక్‌ సింగర్‌ శృతి (22) సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన దయాకర్‌ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమవగా, ప్రేమించుకున్నారన్నారు. గత నెల 24న వారు వివాహం చేసుకోగా నాటి నుంచి కట్నం తీసుకురావాలని తమ కూతుర్ని భర్త దయాకర్‌తో పాటు వారి తల్లిదండ్రులు వేధించారని, ఈవిషయాన్ని ఫోన్‌లో తమ కూతురు చెప్పి రోధించినట్లు శృతి తల్లి శ్యామల తెలిపారు. బుధవారం తెల్లవారుజామున శృతిని భర్త, అత్తమామలు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని వీరిపై జగదేవ్‌పూర్‌ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు శృతి తండ్రి రమేష్‌ వెల్లడించారు. గురువారం సాయంత్రం శృతి అంత్యక్రియలు స్వగ్రామమైన తిమ్మాపూర్‌లో నిర్వహించారు.

క్రైం కార్నర్‌

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య


బందెల శివరాజ్‌ (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. జంగంపల్లి గ్రామానికి చెందిన బందెల శివరాజ్‌ (45) గత రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలు అస్పత్రుల చుట్టూ తిరిగినా నొప్పి తగ్గలేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి శివరాజ్‌ వ్యవసాయబావి వద్ద గల మేకల కొట్టం వద్దకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అనంతరం కొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అతడి భార్య లక్ష్మి వెళ్లి చూడగా శివరాజ్‌ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న భిక్కనూరు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టరం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

- ఒకరి మృతి


లక్ష్మణ్‌(ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మల్లారం గండిలో బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌ తెలిపారు. వివరాలు ఇలా.. మోస్రా మండలానికి చెందిన కొత్తిమీర్‌కర్‌ లక్ష్మణ్‌(23) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్తుండగా మల్లారం గండీ వద్ద ఓ ట్రాలీ ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ట్రాలీ ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడి అన్న రాహుల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఎంఈవో మృతి


జెతాలాల్‌ (ఫైల్‌)

మాచారెడ్డి: పాల్వంచ మండల విద్యాధికారి జెతాలాల్‌ (58) ఇటీవల అనారోగ్యానికి గురికాగా, గురువారం చికిత్స పొందుతూ మృతిచెందారు. అతడికి రెండు రోజుల క్రితం బ్రెయిన్‌ స్ట్రోక్‌ రాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ గురువారం ఉదయం మృతి చెందారు. భవానీపేట తండాలో జరిగిన అంత్యక్రియల్లో డీఈవో రాజు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆరెపల్లి ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎంగా పనిచేస్తున్న జెతాలాల్‌ ఇటీవల పాల్వంచ ఎంఈవోగా నియమితులయ్యారు.

బడా పహాడ్‌ వద్ద గుర్తుతెలియని వ్యక్తి..



వర్ని: మండలంలోని బడా పహాడ్‌ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వర్ని ఎస్సై రమేష్‌ గురువారం తెలిపారు. మృతుడికి సుమారు 70 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, గత వారం రోజులుగా బడాపహాడ్‌ ప్రాంతంలో బిక్షాటన చేస్తున్నాడని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడం లేదా అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చునని పేర్కొన్నారు. వక్ఫ్‌ బోర్డు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని హజ్గుల్‌ మంజీరా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై మోహన్‌రెడ్డి బిచ్కుంద శివారులో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించామని, ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా దాచిన కలప..



ఎల్లారెడ్డి: జాన్కంపల్లి ఖుర్దు గ్రామ శివారులో అక్రమంగా దాచి ఉంచిన టేకు కలపను పట్టుకుని సీజ్‌ చేసినట్లు డిప్యూటీ రేంజ్‌ అధికారి శ్రీనివాస్‌ నాయక్‌ గురువారం తెలిపారు. గ్రామ శివారులోని పంట పొలంలో అక్రమంగా కలప దాచి ఉంచారన్న సమాచారం రావడంతో అటవీశాఖ సిబ్బందితో దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన గొల్ల నారాయణ పొలంలో దాచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

దేవునిపల్లిలో బైక్‌ చోరీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి బైక్‌ చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దుంపల దత్తుకు చెందిన టీఎస్‌ 17ఎల్‌ 4987 నెంబర్‌ గల బైక్‌ ఇంటి ఆవరణలో నిలిపి నిద్రించగా, గురువారం లేచి చూసేసరికి చోరీకి గురైందన్నారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

ఒకరి రిమాండ్‌

ఖలీల్‌వాడి: రేషన్‌ బియ్యం అక్రమ తరలింపు కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోగల ఆశోక్‌ నగర్‌లో రేషన్‌ బియ్యం తరలింపు కేసులో సమీర్‌ను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారం క్రితం కేసు నమోదు అయినట్లు సమాచారం.

ఫేక్‌ ఎస్బీఐ యాప్‌తో మోసం.. డబ్బులు స్వాహా..



సెల్‌ఫోన్లకు వచ్చిన మెసేజ్‌

నందిపేట్‌(ఆర్మూర్‌): ఫేక్‌ ఎస్బీఐ యాప్‌తో సైబర్‌ మోసగాళ్లు ఖాతాదారుల నుంచి డబ్బులు కొట్టేసిన ఘటన నందిపేట్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రంలో గురువారం ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ ప్రారంభమయింది. కాగా మధ్యాహ్నం నుంచి పలువురు సెల్‌ఫోన్లకు వాట్సప్‌ ద్వారా ఎస్‌బీఐ యోనో యాప్‌ పేరిట కేవైసీని అప్‌డేట్‌ చేసుకోమని మెసేజ్‌ వచ్చింది. దీంతో కొందరు పొరపాటున ఆ లింక్‌పై నొక్కారు. వెంటనే యాప్‌ డౌన్‌లోడ్‌ అవడం అంతలోనే వాట్సాప్‌ హ్యాక్‌ కావడం అకౌంట్లో నుంచి డబ్బులు ఖాళీ అయినట్లు మెసేజ్‌ రావడం చకచకా జరిగిపోయాయి. ఇలా నందిపేటలోని రాంనగర్‌ కాలనీకి చెందిన బోడ రాజు అకౌంట్‌ నుంచి రూ. 6వేలు కాజేశారు. ఇలాగే పలువురి ఖాతాల నుంచి డబ్బులు మాయమయ్యాయి. కాగా రాజు వెంటనే మిగతా గ్రూప్‌ సభ్యులకు నా వాట్సప్‌ హ్యాక్‌ అయిందని తన పేరిట వచ్చిన బ్యాంకు లింకును ఎవరు ఓపెన్‌ చేయవద్దని సమాచారం అందించారు. అనంతరం పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

గుంజ్లీ గ్రామంలో బైక్‌ దహనం



మాక్లూర్‌: మండలంలోని గుంజ్లి గ్రామంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని కురుమ పత్తేపూర్‌ కిషన్‌కు చెందిన బైక్‌ ఇంటి ఎదుట ఉంచగా బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. బైక్‌కు అంటుకున్న మంటలతో ఇంటి కిటికీ కాలిపోయి ఇంట్లోకి పొగలు రావడంతో ఇంట్లోని వారు మేల్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. కిషన్‌ ఇటీవల ఉపాధి నిమిత్తం దుబాయ్‌ వెళ్లగా అతని కుమారుడు బైక్‌ను నడుపుకుంటున్నాడు.

డీసీఎం వ్యాన్‌ బోల్తా



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమం సమీపంలో కామారెడ్డి–ఎల్లారెడ్డి రోడ్డుపై తవుడు లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ ప్రమాదవశాత్తు బోల్తా పడిందని గ్రామస్తులు గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వ్యాన్‌ వస్తుండగా బుధవారం రాత్రి శబరిమాత ఆశ్రమం వద్దగల మూలమలుపు వద్ద అదుపుతప్పి పల్టీలు కొట్టిందన్నారు. వాహనం అద్దాలను పగులకొట్టి డ్రైవర్‌ బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నాడన్నారు. ఎవరికి ప్రాణనష్టం జరగలేదన్నారు. మండలకేంద్రంలోని పలు మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని మూలమలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.